# కష్టానికి దక్కిన సత్కారం

- విద్యార్థి సంఘం ఉద్యమ నేతగా రాజకీయాల్లోకి అడుగు..
- ఇండిపెండెంట్ ఉప సర్పంచ్‌గా గెలిచి సొంత గ్రామానికి సేవలు
- బిజేపి సిద్ధాంతాలకు ఆకర్షితుడై 2019లో చేరిక..
- నాటి నుంచి నేటి వరకు పార్టీ కోసం నిష్కల్మష కృషి
- బిజేపి అభ్యర్థుల గెలుపునకు.. పార్టీ బలోపేతానికి నిర్విరామ శ్రమ
- నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..
- లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీ

## బీజేపీ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడిగా మాలోత్ గాంధీ





కొత్తగూడెం, జూన్26(కెరటం ప్రతినిధి)

భారతీయ జనతా పార్టీలో తన ఆరేండ్ల కష్టానికి తగిన సత్కారం దక్కింది. వామపక్ష విద్యార్థి ఉద్యమ నేతగా నూనూగు మీసాల ప్రాయంలోనే అడుగు పెట్టి.. అనతి కాలంలోనే అనేక పదవులు అధిరోహించి.. స్వగ్రామానికి సేవ చేయాలన్న సంకల్పంతో ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచి ఉపసర్పంచ్‌గా తనవంతు గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందించి.. సుదీర్ఘకాలం పాటు జర్నలిస్టుగా ప్రజా సమస్యలపై తనవంతు ప్రజలకు అవగాహన కల్పించి.. బిజేపి పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై పార్టీ బలోపేతానికి ఇంతకాలం చేసిన కృషికి తగిన గౌరవం దక్కింది. సామాన్య కార్యకర్తగా పార్టీలో చేరి.. అనతికాలంలోనే పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా పదవీబాధ్యతలు ఎంతో సమర్థవంతంగా నిర్వర్తించి.. ప్రస్తుతం బీజేపీ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఇంతకీ ఆయన ఎవరో కాదు లాలుతండాకు చెందిన మాలోత్ గాంధీ. లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడిగా బుధవారం పార్టీ కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కె.వి రంగా కిరణ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.

**గాంధీ కుటుంబ నేపథ్యమిది..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం లాలుతండాకు చెందిన రాంచందర్, రాణి దంపతులకు ముగ్గురు సంతానంలో చిన్నవాడు మాలోత్ గాంధీ. గాంధీ ఏడో తరగతి వరకు కొత్తగూడెం పట్టణంలోని శ్రీవిద్య పాఠశాలలో సాగింది. అనంతరం పదో తరగతి వరకు ఇల్లందు పట్టణంలోని జేబిఎస్ స్కూల్లో చదివాడు. ఇంటర్‌ను తిరిగి కొత్తగూడెంలోని మార్గదర్శిని కళాశాలలో పూర్తి చేశారు. డిగ్రీని అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటిలో పూర్తి చేశారు. కాగా గాంధీకి మహాలక్ష్మితో వివాహం కాగా, కుమార్తె మనిశ్విని, కుమారుడు శశాంక్ నాయక్ ఉన్నారు. కాగా విద్యార్థి దశలో 2004లో ఎస్ఎఫ్ఐ టేకులపల్లి మండల కార్యదర్శిగా, కొత్తగూడెం పట్టణ కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం సీఐటియూలో గణేష్ టెంపులో ఆటో అడ్డా కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం 2010 నుంచి జర్నలిస్టుగా ప్రస్థానాన్ని ఆరంభించిన అనేక పత్రికల్లో పనిచేశారు. కన్నఊరిని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో 2019లో లాలుతండా గ్రామ ఉపసర్పంచ్‌గా ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచి గెలిచి తన వంతు తోడ్పాటునందించారు. అనంతరం బిజేపి పార్టీకి ఆకర్షితుడై 2019లో బిజేపిలో చేరారు. పార్టీలో చేరిన అనతికాలంలోనే మండల ప్రధాన కార్యదర్శిగాఆ బాధ్యతలు చేపట్టి పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేశారు. ఆయన కష్టాన్ని గుర్తించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కె.వి రంగా కిరణ్ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షునిగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు.

**నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..**

బీజేపీ లక్ష్మీదేవిపల్లి మండల నూతన అధ్యక్షుడిగా మాలోత్ గాంధీ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ అప్పజెప్పిన బాధ్యతలను వమ్ము చేయకుండా, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. సమన్వయంతో పని చేస్తూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేపడతామన్నారు. రాబోయే స్థానిక ఎలక్షన్లలో లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని 31 గ్రామపంచాయతీలో అభ్యర్థులను బరిలో దించుతామని, పార్టీ వార్డు స్థాయి నుంచి బలోపితం చేస్తానని ఆయన తెలిపారు. తన కష్టాన్ని గుర్తించి మండల అధ్యక్షుడిగా నియమించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కె.వి రంగా కిరణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన పోనిశెట్టి వెంకటేశ్వర్లు, నోముల రమేష్, గొడుగు శ్రీధర్ యాదవ్. ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.






## జర్నలిస్ట్ పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ..

- టియుడబ్ల్యూజే(టిజేఎఫ్) వినతికి ఉత్తర్వులు జారీ చేసిన డీఈవో
- కల్లోజి కృషికి జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల హర్షం

కొత్తగూడెం, జూన్26(కెరటం ప్రతినిధి)

జర్నలిస్ట్‌ల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం జిల్లా లో వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో చదివే జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీని కల్పించాలని టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు కల్లోజి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ యూనియన్ ప్రతినిది బృందం జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలల నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో జర్నలిస్ట్‌ల కుటుంబాలు ఎదుర్కొంటున్న ఫీజుల సమస్యను డీఈవోకు వివరించారు. వెంటనే స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం కల్పిస్తూ వెను వెంటనే ఉత్తర్వులు జారీ చేసి టియూడబ్ల్యూజే(టిజేఎఫ్) నేతలకు అందించారు. ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారికి యూనియన్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. కాగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు వాటి పరిష్కారానికి శ్రమిస్తూ.. పాఠశాలల్లో 50శాతం రాయితీకి కృషి చేసిన టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు కల్లోజి శ్రీనివాస్‌కు జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు చంద్ర నరసింహారావు, జిల్లా నేతలు కొత్త వెంకటేశ్వర్లు, సువర్ణపాక శోభన్ బాబు, నరసింహారావు, ప్రభాకర్ రెడ్డి, అబ్రహాం, చీమకుర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.